

హైదరాబాద్ వార్త

# 'బిసి బంద్'.. డబుల్ ఛార్జీలు..!

## -పండుగ పూట క్యాబ్‌ల దోపిడీ





**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** అసలే పండగ. మూడు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో వలస వచ్చిన కార్మికులతో పాటు విద్యార్థులు పెట్టేబేడ సర్దుకుని సొంత స్థలాలకు పయణమయ్యారు. కానీ.. బస్టాండ్లకు చేరుకోగానే బస్సులు బంద్ అని తెలిసి అసహనం వ్యక్తం చేశారు. కొందరికి ముందే బంద్ అని తెలిసి ముందుగానే ప్లాన్ చేసుకున్నారు. ఎలాగైతేనేం.. అందరికీ తమ తమ సొంత వాహనాలు ఉండవు.. బస్సులు రోడెక్కే పరిస్థితి లేదు. ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. మరోవైపు.. ప్రైవేటు క్యాబ్స్ ఓనర్స్‌కి ఇదే మంచి సమయం అనుకున్నారు. ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు. ఏకంగా రెండింతల ఛార్జీలు వసూలు చేస్తున్నారు. రెండ్రోజులైనా ఇంట్లో సుఖంగా ఉందామని బయలుదేరిన ప్రయాణికులు ఆ ఛార్జీలు చూసి లబోదిబోమంటున్నారు.. ఎల్బీనగర్ నుంచి సూర్యాపేటకు మామూలు రోజుల్లో రూ.200లు తీసుకుంటారు.. కానీ ప్రస్తుతం రూ.800 డిమాండ్ చేస్తున్నారు ప్రైవేట్ కార్ల డ్రైవర్లు.. విజయవాడ వెళ్లాలంటే ఒక్కొక్కరికి రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. మరోవైపు. .తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. శనివారం బీసీ వర్గాల హక్కుల సాధన కోసం, 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్దత డిమాండ్తో రాష్ట్ర బందు బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో అన్ని విద్యాసంస్థలు సెలవును ప్రకటించాయి. మరునా డు అక్టోబర్ 19 ఆదివారం కావడంతో అది వారపు సెలవు. ఆ మరుసటి రోజు, అంటే అక్టోబర్ 20 దీపావళి సెలవు. ఈ విధంగా ఆదివారం కలిసిరావడంతో వరుసగా మూడు రోజులు సెలవులు లభించాయి. పాఠశాలలు, కళాశాలలు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసం స్థలు మూతపడతాయి. పండగ వేళ వరుస సెలవులు రావడంతో విద్యార్థులు ఎగిరిగంతేస్తు న్నారు బంద్ కారణంగా రాష్ట్ర రాజధాని హై దరాబాద్ లో బస్సు చక్రం కదలలేదు. అన్ని బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. దీంతో ప్రయాణికులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ప్రయాణికులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. అధిక డబ్బులు వసూలు చేశారు. ఎమర్జెన్సీ సేవల్లో పని చేసే సిబ్బంది తమ సిబ్బంది ఉద్యోగాలకు వెళ్లేందుకు క్యాబ్‌లను ఆశ్రయించగా వారు చెప్పే ధరలను చూసి బెంబేలెత్తుతున్నారు. ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్ల దందా ప్రయాణికు లను షాక్‌కు గురి చేస్తోంది. ఉప్పల్ నుంచి హ న్మకొండకు ప్రయాణికుల నుంచి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో రూ. 300 తీసుకునే క్యాబ్ డ్రైవర్లు ఇవాళ బంద్ కారణంగా రూ.700 వసూలు చేస్తున్నారు. ఇక నగరంలో ఇన్నాళ్లు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకం వల్ల ఇన్నాళ్లు బోసి బోయిన ఆటోలు ప్రయాణికుల రద్దీతో ఫుల్ డిమాండ్ పెరిగింది. వరుస సెలవులు ఉన్నాయని సొంత ఊర్లకు వెళ్లాలనుకునే వారికి ప్రైవేట్ వాహనాల ధరలు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.

# గ్రేటర్‌లో ప్రశాంతంగా 'బిసిబంద్'

**-డిపోలకే పరిమితమైన బస్సులు**
**-స్వచ్ఛందంగా స్కూళ్లు, కాలేజీలు మూసివేత**
**-పలు చోట్ల చెదురు మదురు ఘటనలు**



**హైదరాబాద్, అక్టోబరు 18,ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధించేందుకు బీసీ జేఏసీ తలపెట్టిన బంద్ ప్రశాతంగా ముగిసింది. ఈబంద్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. అలాగే స్కూళ్లు, కాలేజీలు స్వచ్ఛందంగా మూసివేశాయి. పలువురు వ్యాపారసంస్థలు సైతం దుకాణాలు మూసే ఉంచారు. మరి కొన్ని చోట్ల షాపింగ్‌మాల్స్ తెరవగా ఆందోళన కారులు వెళ్ళిమూసివేయించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారు సొంత వాహనాలు, మెట్రో ద్వారా రాకపోకలు సాగించారు. ఎల్బీనగర్ జాతీయ రహదారిపైజేఏసీ నేతలు బైటాయించగా అక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అలాగే బంద్ సందర్భంగా పలుచోట్ల చెదురు మొదరు ఘటనలు చోటు చేసుకన్నాయి. నల్లకుంట ప్రాంతంలో బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. బంద్‌ను పాటించకుండా తెరిచి ఉన్న బజాజ్ షోరూంతో పాటు రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌పై ఆందోళనకారులు పెద్ద సిమెంట్ బ్లాక్స్‌తో దాడి చేశారు. దీంతో అలాగే బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం అద్దాలు ధ్వంసం చేశారు. బర్కత్‌పురాలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ తెరిచి ఉండటంతో ఆందోళనకారులు ఫ్యూయల్ మెషిన్లను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.ఎంజిబిఎస్ బస్టాండ్ వద్ద బిసి జెఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో డిపోముందు ఉదయం 5గంటల నుంచే బైటాయించారు. దీంతోఎక్కడిబస్సులు అక్కడే ఆగిపోయాయి. వీరికి మద్దతులుగా పిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈసందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే బైటాయించారు. అలాగే జూబ్లీబస్టాండ్ వద్ద బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు, బిసి సంఘాల నాయకులు పాల్గొని రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.అలాగే బర్కత్‌పురా బస్ డిపో ముందు బిసి జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌లు బైఠాయించారు. అలాగే ఆర్టీసి క్రాస్‌రోడ్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించగా దీనికి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ హాజరై రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అలాగే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖైతరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి ఆటోలో వచ్చి తన కొడుకుతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు.అనంతరం మానవహారం నిర్వహించారు.

# నగరంలో భారీగా ట్రాఫిక్ జాం

**-రోడ్లపై పూల,బాణాసంచా దుకాణాలు ..పోలీసుల అడ్డదిడ్డ ఆంక్షలు -గంటల తరబడి వాహనదారుల నరకయాతన**



**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** దీపావళి పండగకు ఇంకా రెండు రోజుల మాత్రమే మిగిలివుండగా జంట నగరాలు, శివారు ప్రాంతాలలో అప్పుడే పండగ సీజన్ వచ్చేసింది. పండగ కోసం కొత్త బట్టలతో పాటు ఇతర వస్తువులను, బాణాసంచాను కొనేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు శనివారం మార్కెట్లకు రాగా అక్కడి రహదారులపై నెలకొన్న ట్రాఫిక్ జాంలు వారికి చుక్కలు చూపించాయి. రోడ్లపై పూల దుకాణాలకు తోడు బాణా సంచా దుకాణాలు వెలియడంతో పాటు పోలీసుల అడ్డదిడ్డ ఆంక్షల కారణంగా అనేక మార్గాలలో వాహనాలు క్రిక్కిరిసి పోవడంతో వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్ జాంలో ఇరుక్కుని నరకయాతన పడ్డారు. సాధారణంగా పండగ వేళ జంట నగరాలు, శివారు ప్రాంతాలలో రహదారులు ఖాళీగా వుంటాయి. ఆయా ప్రాంతాల ప్రజలు సొంత ఊళ్లకు వె ళుతుండడంతో అక్కడి బస్తీలు ఖాళీ అవుతుండడం, ఇదే సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతుండడం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల ప్ర జలకు ముఖ్యమైన పండగల్లో దీపావళి కూడా ఒకటి. అయితే దీపావళి పండగకు రెండు రోజుల ముందు అంటే శనివారం నాడు జంట నగరాలు, శివారు ప్రాంతాలలో అనేకచోట్ల అనూహ్యంగా ట్రాఫిక్ జాంలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. పండగ వేళ ఎక్కడికక్కడ పూల వ్యాపారులు, బాణాసంచా వ్యాపారులు రహదారులపై తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవడంతో వీటి కోసం వచ్చేవారు తమ వా హనాలను రోడ్ల పక్కనే నిలిపివేయడంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. దీనికి తోడుగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని చోట్ల డ్రైనేజిలు పొంగడంతో వాటిని బాగుచేసేందుకు వాటర్ వర్క్స్ అధికారులు రోడ్లపై తవ్వకాలు చేబట్టారు. ఈ కారణంగా పలుచోట్ల రోడ్లపై బా రీకేడ్లు ఏర్పాటు చేయడంతో రహదారులు కుంచించుకు పోయాయి. ఇలా అనేక కారణాల వల్ల శనివారం ఉదయం నుంచి రాత్రి బాగా పొద్దుపోయే వరకు ట్రై కమిషనరేట్లలోని అనేక మార్గాలలో ట్రాఫిక్ జాంలు వాహనదారుల సహనాన్ని పరీక్షించాయి. నగరంలోని ప్రధాన రహదారి అయిన అఫ్జల్ గంజ్ నుంచి సనత్‌నగర్ మార్గంతో పాటు అఫ్జల్‌గంజ్ నుంచి కోఠి మీదుగా సికింద్రాబాద్ వెళ్లే మార్గం సహా అనేక రహదారులు వాహనాలతో క్రిక్కి రిసి పోయాయి. ఇందిరా పార్క్ వద్ద గల ధర్నా చౌక్ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు చుట్టూ తిరిగి ప్రయాణాలు సాగి ంచాల్సి వచ్చింది. ఎన్టీఆర్ స్టేడియంలో బాణాసంచ దుకాణాలను అనుమతులు మంజూరు చేయడం వల్ల ఇక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పో లీసులు చెబుతున్నా, వాహనదారుల పరిస్థితి ఏమిటనే దానిపై వారు సమాధానం ఇవ్వడం లేదు. దీని కారణంగా అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగి పోయింది. మాసాబ్‌ట్యాంక్.. .లక్డికాపూల్ మార్గంలో ఏసీ గార్డ్స్ వద్ద డ్రైనేజి మరమ్మత్తుల కోసం రోడ్డుపై బారీ కేడ్లను ఏ ర్పాటు చేయడంతో ఆ మార్గం చిన్నదిగా మారి వాహనాలు ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డాయి. దీని కారణంగా అటు లక్డికాపూల్ నుంచి తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జితో పాటు ఇటు ఖైరతాబాద్, రవీంద్ర భారతి మార్గంపైనా పడింది. మొహదీపట్నం చౌరస్తా, రేతిబౌలి నుంచి టోలిచౌకి మార్గం, రేతిబౌలి నుంచి లంగర్‌హౌజ్ మార్గంలో రోడ్లపైనే పదుల సంఖ్యలో పూల దుకా ణాలు, బాణాసంచా దుకాణాలు వెలియడంతో వాహదారుల కష్టాలకు అంతు లేకుండా పోయింది.

# పోలింగ్ సక్రమంగా జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలి

**-పీఓ, ఏపీఓ, ఓపిఓల బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి**
**-శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్**



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఓపిఓ లది కీలకపాత్ర అని...తమ విధులు,బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. శనివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో బంజార హిల్స్ బంజారా భవన్ లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు , ఓపిఓ లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2,300 మందికి పైగా అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ఆర్ వి కర్ణన్ పీఓ, ఏపీఓ, ఓపిఓ లకు ఎన్నికల పోలింగ్ రోజు వారి విధులు, బాధ్యతలపై జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రం లోపల , వెలుపల కార్యకలాపాల నిర్వహణ, ఎన్నికల అధికారులు చేయవలసినవి ,చేయకూడని అంశాలను జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ, ఏపీఓ, ఓపిఓ లు తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. శిక్షణ పొందిన నాటి నుంచి పోలింగ్ ముగిసేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల పీఓ, ఏపీఓ, ఓపిఓ లుగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సందేహాలు ఉంటే శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ ఆఫీసర్ తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవీఎంల నిర్వహణ,పిఓ,ఏపిఓ డైరీ,వారి విధులు,పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు,మాక్ పోల్,ఈవీఎం,వివి ప్యాట్ లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదివి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవీఎం అనుసంధానం, మాక్ పోలింగ్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ లుఅధికారులకు అవగా హన కల్పించారు.సందేశాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బాధ్యులు సునంద, మమత పాల్గొన్నారు.

## 20న శృంగేరి ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి రాక



విధుశేఖర భారతి

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** శ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతీస్వామి విజయ యాత్రలో భాగంగా ఈనెల 20న భాగ్యనగరానికి రానున్నారు. ఆయన ఈనెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో ఉండనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు చంద్రమౌళీశ్వర పూజ, అభిషేకం నిర్వహి స్తారు. అలాగే ప్రతి రోజు 11.30గంటల నుంచి మధ్యాహ్నానం 1.30 గంటల మధ్య భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని శంకరమఠం ధర్మాధికారి సి.శ్రీనివాసమూర్తి తెలిపారు.శ్రీవిధుశేఖర భారతీస్వామిని దర్శించుకు నేందుకు వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాల్సి ఉంటుంది.

## సదర్ ఉత్సవాలను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



చెప్పల్‌బజార్‌లో సదర్ ఉత్సవాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ గౌతంరావు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త** కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో యాదవుల సదర్ ఉత్సవాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన 'అల్ ఇండియాన్ ఛాంపియన్ బుల్స్'కు స్వాగతం పలికారు.. దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సదర్ ఉత్సవాలు నిర్వహించే యాదవ సోదరులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిలో ప్రతి పండుగ పవిత్రమైనదని, సదర్ పండుగ వేళ దున్న రాజుల ప్రదర్శన ఎంతో అద్భుతంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. దున్న రాజులను ఎంతో ఆకర్షణీయంగా అలంకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.గౌతంరావు, బిజెపి నేతలు ఎక్కాల నందు, నంద కిషోర్‌యాదవ్, లడ్డూయాదవ్, పాల్గొన్నారు.

## విద్యార్థులతో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ముఖాముఖి



విద్యార్థులతో మాట్లాడుతున్న హరిచందన దాసరి

**హైదరాబాద్, అక్టోబరు 18,ప్రభాతవార్త:** విద్యార్థులకు తరచుగా ఎడ్యుకేషనల్ టూర్స్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధింత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ నందు వివిధ పాఠశాల బాల బాలికలు కలెక్టరేట్లోని పలు విభాగాలను సందర్శించి, జిల్లా కలెక్టర్ తో ముఖాముఖి లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య బోధనతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చుని, విద్య ఒక విలువైన సంపదని అన్నారు. విద్యార్థులలో అనుభవ పూర్వక అభ్యాసం ఒక పరివర్తనాత్మక విదానాన్ని సూచిస్తుందని అన్నారు. ఎడ్యుకేషనల్ టూర్ లో భాగంగా, హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అలాగే ఉపాధ్యాయులు కలెక్టరేట్ ను సందర్శించారు. ఈ పర్యటన ద్వారా జిల్లా యంత్రాంగం పరిపాలన ఎలా పనిచేస్తుందో, కలెక్టరేట్ పాత్ర ఏంటో ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో వెంకటాచారి పాల్గొన్నారు.

## బిసిలను మోసం చేసేది బిజెపియే : మంత్రి కొండా సురేఖ



సికింద్రాబాద్ రేతిఫైల్ వద్ద నిర్వహించిన బంద్‌లో మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 18 ప్రభాతవార్త:** 42 శాతం బీసీ బిల్లును అమోదించడంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తూ బీసీ ద్రోహిగా బిజెపి పార్టీ వ్యవహరిస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్‌లు ఆరోపించారు. బీసీలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్ధతు తెలుపుతూ శనివారం సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాప్ వద్ద బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను మోసం చేసేది బిజెపి, బిఆర్ఎస్ పార్టీలే అన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ అన్నివిధాలా ప్రయత్నం చేస్తుందన్నారు. బీసీల పట్ల బిజెపి, కపట ప్రేమ చూపిస్తూ దొంగనాటకాలు అడుతున్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో బిజెపి తలుచుకుంటే 5 నిమిషాల సమయం పట్టదన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి. సంతోష్ యాదవ్,బద్రి యాదవ్, నందికంటి రవి, శేఖర్ ముదిరాజ్, పెద్దాల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రా బాద్ పరిసర ప్రాంతాల్లో తెరిచిన దుకాణాలను, హోటళ్లను బంద్ చేయించారు.

## ఎసిబికి పట్టుబడ్డ ఎలక్ట్రికల్ ఏఇ



కాంట్రాక్టర్ నుండి రూ.30.వేలు లంచం తీసుకుంటూ ఏసీబికి పట్టబడ్డ హిమాయత్ సాగర్ ఎలక్ట్రికల్ ఎ.ఇ అమర్ సింగ్.

**నార్సింగి, అక్టోబర్18 ప్రభాతవార్త :** కాంట్రాక్టర్ వద్ద రూ.30. వేలు లంచం తీసుకున్న ఎలక్ట్రికల్ ఏఇని అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. ఏసీబీ ఏసీపి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హిమాయత్ సాగర్ సన్ స్టేషన్ గంధంగూడ సెక్షన్ ఆఫీసులో అమర్ సింగ్ ఎలక్ట్రికల్ ఏ.ఇగా పని చేస్తున్నారు. ఓ కాంట్రాక్టర్ ట్రా న్స్‌ఫార్మర్ పని చేయాలని ఏఇని కలిశాడు. తన పని తాను చేసేందుకు రూ.30.వేలు లంచం కావాలని డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని తగ్గించాలని ఎంత అడిగినా... తగ్గలేదు. దీంతో విసుగు చెందిన కాం ట్రాక్టర్ ఏసిబిని ఆశ్రయిం చాడు. రంగంలోకి దిగిన హైదరాబాద్ రేంజ్ ఏసిబి అధికారులు రూ. 30.వేలకు రంగు అద్ది కాంట్రాక్టర్ చేత శనివా రం మధ్యాహ్నాం ఏఇ అమర్ సింగ్ కు అతడి కార్యాలయం లోనే ఇప్పించారు. ఏఈ డబ్బులు తీసుకోగానే ఏసిబి అధికారులు దాడిచేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎఈ నుంచి రూ.30.వేలను స్వాధీనం చేసుకొని, అతడిని ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయ మూర్తి ముందు హాజరు పరిచారు.ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎక్క డైనా లంచం అడిగితే బాధితులు వెంటనే ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 10 64కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అధకారుల లోని అవినీతిని తగ్గించేందుకు ఏసిబికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.

## బస్తీ బాటలో విద్యుత్ అధికారులు..



బస్తీ బాటలో పాల్గొన్న అధికారులు

**జీడిమెట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

విద్యుత్ సరఫరాలో సమస్యల తలెత్తకుండా ముందస్తు చర్యలో భాగంగా విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం జీడిమెట్ల ఏడిఈ ప్రేమ్ కుమార్, ఏఈ ప్రసన్న ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి డిసిపి ఆఫీస్, హెచ్ఎంటి సొసైటీ వివిధ ప్రాంతాలలో ప్రధాన విద్యుత్ సరఫరా లైలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేశారు. అనంతరం ఏడీఈ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఈదురు గాలులకు, వర్షానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ బస్తీ బాటలో భాగంగా చెకింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు.

## శబరిమలకు తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు



మణికొండ శివాలయం నుంచి శబరిమల కొండకు పాదయాత్రగా బయలు దేరి వెళ్తున్న అయ్యప్ప స్వాములు.

**నార్సింగి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** గురుస్వామి రాజుగౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు మణికొండ నుంచి శబరిమలకు తరళి వెళ్లారు. దేవాలయంలో గురుస్వాముల సమక్షంలో ఇరుముడులు కట్టుకొని పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన అయ్యప్ప నామ శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నాయకులు బుద్ధోళ శ్రీరాములు, మధుసూదన్‌రెడ్డి, అరవింద్, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, శివానందరెడ్డి, రామిరెడ్డి, ఇందిరా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌డి స్టూడెంట్‌ను అభినందించిన మంద క్రిష్ణ మాదిగ



పిహెచ్‌డి స్టూడెంట్‌ను అభినందిస్తున్న మంద క్రిష్ణ మాదిగ

**అడ్డగుట్ట, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీలో పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలో 10వ ర్యాంక్ సాధించిన గుడ్డిపోచగల్ల నిషాంత్ కుమార్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు,పద్మశ్రీ అవార్డు గ్రహిత మంద క్రిష్ణ మాదిగ అభినందించారు. ఓయులోని ఇంజనీరింగ్ ఎల్రక్టికల్ విభాగంలో ఎస్సీ వర్గీకరణతోనే తనకు సీట్ వచ్చిందని నిషాంత్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంద క్రిష్ణ మాదిగ ఆ స్టూడెంట్‌కు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

## రెజ్లింగ్ పోటీల్లో తనిష్క్ యాదవ్‌కు పసిడి పతకం



జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్–19రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించిన తనిష్క్ యాదవ్

**నార్సింగి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్–19 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో జైభవాని వ్యాయామశాలకు చెందిన తనిష్క్ యాదవ్ పహిల్వాన్ పసిడి పతకం సాధించాడు. శనివారం నార్సింగిలో దానయ్య వ్యాయామశాలలో ప్రభుత్వ అధికారుల సమక్షంలో జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్–19. రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. శంషాబాద్‌లోని సక్సెస్ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న తనిష్క్ యాదవ్ ఈ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, విజేతగా నిలిచాడు. నిర్వాహకులు, అధికారులు అందరూ తనిష్క్‌ను అభినందించారు. ఈ నెల 21.వ,తేదీన తెలంగాణ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేశామని అధికారులు స్పష్టం చేశారు. తనిష్క్ రాష్ట్రస్థాయి పోటీలలో సైతం విజయం సాధించాలని తోటి పహిల్వాన్లు, కోచ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారి ఈశ్వర్, మల్ల యోధులు అంజన్న, బాబన్న, రాజ్ కుమార్, కొండల్, వీరేష్, రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జీవోపై హై కోర్టు స్టే ఇవ్వడం అన్యాయం



జెబిఎస్ వద్ద నిర్వహించిన బంద్‌లో ప్రసంగిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. బీసీ బంద్ పిలుపు మేరకు శనివారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ వద్ద తెలపెట్టిన బంద్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 52 శాతం ఉన్న బీసీలను 42కు కుదించడం సరైంది కాదన్నారు. 50 యేండ్ల కాంగ్రెస్ పాలనలో ఒక ముఖ్య మంత్రి కూడా కాలేక పోయారన్నారు. మంత్రి వర్గంలో బీసీలకు సముచిత స్థానం లేదన్నారు. బీసీలు ఆర్థిక, రాజకీయంగా, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. దేశంలో బీసీలకు నిజాయితీగా రిజర్వేషన్లు కల్పించింది తమిళనాడు రాష్ట్రమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బీసీ ఉద్యమ నేత నారగోని, బిజెపి సీనియర్ నాయకులు పిట్ల నాగేశ్ ముదిరాజ్, బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీ బస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నేతలు గజ్జెల నాగేశ్, టీ.ఎన్,నర్సింహ్మా ముదిరాజ్ తదితరులు



బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీకిషన్ మాదిగ తదితరులు



మూసాపేట్‌లోని మున్సిపల్ కార్యాలయం నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు జరిగిన బంద్‌లో పాల్గొన్న బండి రమేష్



దుండిగల్ మున్సిపాలిటీలో పరిధిలో 42శాతం బీసీ రిజర్వేషన్ కొరకు మున్సిపల్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో పాల్గొన్న నాయకులు



ప్రగతినగర్ జరిగిన బంద్‌లో పాల్గొన్న నాయకులు



నార్సింగిలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు మల్లేష్, శంకరయ్య , శ్రీనివాసులు, ప్రకాశ్, బిక్షపతి, రాజు నాయక్, కేశవులు, కృష్ణ, రాజు



బీసీ బంద్‌లో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్ ,పి.సాయిబాబా, నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్ తదితరులు



కేపీహెచ్‌బి రోడ్ నెంబర్ వన్, గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన బంద్‌లో పాల్గొన్న బీసీ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు



కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరీ ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌లో పాల్గొన్న బైరీ ప్రశాంత్ గౌడ్



మెహిదీపట్నం ఆర్టీసీ డిపో ముందు తెలంగాణ బంద్ లో పాల్గొన్న నాంపల్లి బిఆర్ఎస్ నేతలు



తెలంగాణ బంద్ లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలను టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు.



గుడిమల్కాపూర్‌లో తెలంగాణ బంద్‌లో పాల్గొన్న బిజెపి, ఎంఐఎం నేతలు



బీసీ బంద్‌లో బాగంగా షాపులను మూసివేయిస్తున్న జంటనగరాల మహేంద్ర మేదరి సంఘం గ్రేటర్ అధ్యక్షుడు రేషం మల్లేష్



కాంగ్రెస్ నాయకులు విశాల్ సుధాం,త్రికాల మనోజ్ కుమార్‌లు అన్నారు.బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్యారడైజ్ చౌరస్తాలో ఆందోళణ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు.



బీసీల బంద్‌కు మద్దతుగా డి వివేకానంద్‌నగర్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.



బీసీ బంద్‌లో ప్రసంగిస్తున్న తెలంగాణ కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి



కాంగ్రెస్‌పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయం

## రాయదుర్గం ల్యాంకోహిల్స్‌లో హైడ్రామా...

**-పోలీసు స్టిక్కర్ కారులో వచ్చి సెక్యూరిటీ సిబ్బందిపై దాడి**

**-సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన**

**- పలువురి అరెస్టు**

**-మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారిపై ఆరోపణలు**

**గచ్చిబౌలి, అక్టోబరు 18 ప్రభాతవార్త**

రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. పోలీసు స్టిక్కర్ ఉన్న కారులో వచ్చిన ఓ విజిటర్‌ను పాస్ లేకుండా లోపలికి అనుమతించేందుకు నిరాకరించిన వ్యవహారం చిలికిచిలికి గాలివానగా మారింది. విజిటర్, సెక్యూరిటీ సిబ్బంది మధ్య వివాదం చోటుచేసుకొని తోపులాట జరుగడంతో ల్యాంకోహిల్స్‌లో ఉంటున్న వ్యక్తి తన అనుచరులతో వచ్చి సెక్యూరిటీ సిబ్బంది మీద దాడికి పాల్పడ్డాడు. ఓ వైపు రాయదుర్గం పోలీసులు ఈ విషయమై కేసు నమోదు చేసి 10మందికి నోటీసులు జారీ చేయడంతో పాటు మరో 5గురు పరారీలో ఉన్నట్లు నిర్ధారించారు. కాగా నిందితులను అరెస్టు చేయాలని ఆందోళన చేపట్టిన సెక్యూరిటీ సిబ్బంది మీద పరారీలో ఉన్న 5గురు మరోసారి దాడికి పాల్పడడంతో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివాదంలో ఓ ఐపిఎస్ పేరు వినిపించం సంచలనంగా మారింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ల్యాంకోహిల్స్‌లోని బ్లాక్3 ఎల్‌హెచ్‌లో మహారాష్ట్ర క్యాడర్ ఐపిఎస్ అధికారి తల్లి అద్దెకు ఉంటుంది. వీరి ఫ్లాట్ పక్కనే ఉన్న ఫ్లాట్ నెంబరు 1703లో ఉండే మురళీ వద్దకు వెళ్లేందుకు వినాయకరెడ్డి అనే వ్యక్తి ఈనెల 15వ తేదీన వచ్చాడు. విజిటర్స్ లైన్‌లో కాకుం డా రెసిడెంట్స్ లైన్‌లో రావడంతో పాస్ ఇచ్చేందుకు సెక్యూరిటీ సిబ్బం ది నిరాకరించడంతో మురళీ కిందకు వచ్చాడు. సెక్యూరి టీ సిబ్బంది బాలక్రిష్ణతో మురళీ గొడ వ పడగా, మురళిని బాలక్రిష్ణ నెట్టివేశాడు. దీంతో కోపో ద్రిక్తుడైన మురళీ బాలక్రిష్ణ మీద చెయి చేసుకోగా ఒకరి పై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం అక్కడి నుం చి వెళ్లిపో యిన మురళీ సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో తన అనుచరులు 15మందితో వచ్చి సెక్యూ రిటీ సిబ్బం ది బాలక్రిష్ణ, చందులపై దాడికి పాల్పడ్డాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడి చేసిన 10మందిని గుర్తించి నోటీసులు ఇచ్చి పంపగా, మరో 5గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మరోవైపు ఈ విషయమై సెక్యూరిటీ సిబ్బంది ల్యాంకోహిల్స్ గేటు ముందు ఆందోళన చేపట్టారు. పోలీసు మొబైల్ పార్టీ చేరుకొని నిందితుల మీద కేసు నమోదు చేసినట్లు తెలి పి ఆందోళన విరమింపజేశారు. అదే సమయంలో పరారీలో ఉన్న 5గురు నిందితులు ఓ పోలీసు స్టిక్కర్ ఉన్న వాహనంలో అక్కడికి చేరుకొని పోలీసులు చూ స్తుండగానే సెక్యూరిటీ సిబ్బంది మీద మరోసారి దాడికి పాల్పడ్డారు. ఈ విషయాలు అక్కడి సిసి కెమెరాల్లో సైతం రికార్డు అయ్యాయి. దీంతో రాయదుర్గం పోలీ సులు సదరు 5గురు నిందితులను అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలించారు. కాగా మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అండదండలతోనే నిందితులు చెలరేగి పోయారని, కేసును నీరుగార్చేందుకు పోలీసులపై ఒత్తిడి సైతం తీసుకువచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. అరెస్టులు లేకుండా నోటీసులతో సరిపెట్టాలని పో లీసు ఉన్నతాధికారులను కోరినా సైబరాబాద్ పోలీసులు అందుకు నిరాకరించి నిందితులను అరెస్టు చేసినట్లు తెలుస్తుంది.

## విద్యా, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలి : చంద్రశేఖర్ గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:**



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

బీసీ జేఏసీ తలపెట్టిన తెలంగాణ బందుకు మద్దతుగా తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి జిల్లా కార్యాలయం లో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జ్ ధరించి విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం భోజన విరామ సమయం లో ఉద్యోగులు వారి కార్యాలయం లో నిరసన తెలిపి నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జలసౌధ కార్యాలయంలో కోటి ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం లో నిరసన వ్యక్తం చేస్తూ బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించాలని విద్యా ఉద్యోగాలో కూడా రిజర్వేషన్ కల్పించాలని ప్రమోషన్ లో కూడా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాచులు ధరించి ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. ఈకార్యక్రమానికి వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి రమా దేవి, అడ్వైజర్ సుంకర శ్రీనివాస్, తహశీల్దార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాక రమేష్ , జలమండలి బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామ రాజు ,అ వైద్య ఆరోగ్యశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి జగన్మోహన్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్ఞానేశ్వర్, కె అనిల్ కుమార్ మొగురాల శ్రీనివాస్ యాదయ్య, ప్రభాకర్, రవికుమార్, మహీంద్రా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మీ మందిరంలో దీపావళి మహోత్సవాలు

**చార్మినార్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో దీపావళి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మందిరం ట్రస్టీ శశికళ తెలిపారు. అక్టోబర్ నెల 20వ మందిరంలో దీపావళి పూజా కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలియజేశారు. సాయంత్రం శ్రీ భాగ్య లక్ష్మీ అమ్మవారి ఖజానా భక్తులకు పంపిణీ చేయనున్నామని శశికళ వెల్లడించారు. దీపావళి సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేశామని చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ రమేష్ తెలిపారు. దీపావళి సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని అందంగా అలంకరించారు



## రంగస్థల ప్రావీణ్యుడు దుగ్గిరాల సోమేశ్వరరావు : డా. డిఎస్ఎన్.మూర్తి

**నాంపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త :**

సుప్రసిద్ధ రంగస్థల నటుడు, దర్శకుడు, సున్నిత మనస్కుడు, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత, ఇంజనీరు దుగ్గిరాల సోమేశ్వరరావు గొప్ప రంగస్థల దిగ్గజం, బహుముఖ రంగస్థల ప్రావీణ్యుడని కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు డా. డి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. సోమేశ్వరరావులో మంచి కవి, రచయిత, స్వరధాటి కూడా ఉందని కొనియాడారు. రసరంజని హైదరాబాద్, దుగ్గిరాల కుటుంబ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో సోమేశ్వరరావు 93వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్ఎన్.మూర్తి, ఆత్మీయ అతిథులు అమరేంద్ర, డా. డి.విజయభాస్కర్, రసరంజని రామకోటేశ్వరరావు, నటరాజ్, మోహనసేనాపతి తదితరులతో కలిసి సోమేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా



పలువురు ప్రముఖులకు గౌరవ ఆత్మీయసతారం చేస్తున్న రమణాచారి, మూర్తి, ఎ.నరసింహారావు తదితర అతిథులు

మూర్తి రంగస్థల నాటక రచయిత, నటుడు జె.శశిమోహన్, రంగస్థల టీవి సినీనటి ఎ.నాగమణి, రాయప్రోలు భగవాన్‌లను ఘనంగా సత్కరించి ఆత్మీయ పురస్కారాల ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. చివరిగా మల్లీశ్వరి ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే పి.భవాని ప్రసాద్ రచన, పోలిమెట్ల సుబ్బారావు దరకత్వంలో సందేశాత్మకంగా రూపొందిన నాటిక నువ్వోసగం-నేనోసగం అద్భుతంగా ప్రదర్శింపబడి వీక్షకుల ప్రశంసలందుకుంది.

## సుప్రసిద్ధ గాయనీమణుల సమ్మిళితగాత్రం శారదాసాయి : ఛైర్మన్ రవికుమార్

**రవీంద్రభారతి, అక్టోబరు 18 ప్రభాతవార్త :** సుప్రసిద్ధ గాయనీమణులు సుశీల, జానకి, చిత్రల సమ్మిళితగాత్రం ప్రఖ్యాత నేపథ్య గాయని శారదాసాయి అని ఆంధ్రప్రదేశ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ మందలపు రవికుమార్ అభివర్ణించారు. ప్రార్థనాగీతానికి ప్రతీక గాయని శారదసాయి అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఆనందభైరవి సాంస్కృతిక, సాంఘిక సేవాసంస్థ ద్వారా సంగీతయాత్రను దిగ్విజయంగా సాగిస్తూ జాతీయ అంతర్జాతీయ వేదికలపై తన గానామృతాన్ని అందించడం ద్వారా తెలుగువారి వైభవ ప్రభావాలను విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శారదాసాయి సమర్పణ శ్రీనివాససాయి సమన్వయంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో అంబరాన్నంటిన తెలుగు, హిందీ సినీసంగీత విభావరి, పురస్కారాల ప్రదానోత్సవ సంబరాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎం.రవికుమార్ సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, ఉత్తమ సినీనేపథ్య గాయని మాళవిక, సందీప్, విశిష్ట అతిథులు కాకతీయ డైనాస్టి ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, యోగ గురు అరుణ, శ్రీనివాస్, గౌరవ అతిథులు ఎన్.సుందర రాజు ఉద్యానవనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనేపూడి చక్రవాణి



ప్రఖ్యాత గాయని మాళవికను ఘనంగా సత్కరిస్తున్న రవికుమార్, శ్రీనివాసరావు, చక్రపాణి, శారదాసాయి, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

తదితరులతో కలిసి వివిధరంగాలకు చెందిన ప్రముఖులు లోకవెంకట్రాంరెడ్డి, కె.వి.బ్రహ్మానందం, డా. జిబికె.రావు, డా. ఎం. వెంకటేశ్వరరావు, సరోజ, సిద్ధిరాములులను ఆనందభైరవి పురస్కారాలతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. సభకుముందు శారదాసాయి నేతృత్వంలో ప్రముఖ వర్ధమాన గాయకులచే వీనులవిందుగా సాగిన తెలుగు, హిందీ సినీసంగీత విభావరి ఆహుతులను అలరించి తన్మయుల్ని చేసింది.

## 31 మంది.. 48 నామినేషన్లు

**- మూడో సెట్ నామినేషన్ దాఖలు చేసిన మాగంటి సునీతగోపీనాథ్**

**- జూబ్లీ ఉపఎన్నికల్లో సెంచరీ దాటిన నామినేషన్లు**

**జూబ్లీహిల్స్ , అక్టోబరు 18, ప్రభాతవార్త:**



నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న మాగంటి సునీత. చిత్రంలో సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో నిలిచేం దుకు శనివారం అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నాటికి మొత్తం 63 మంది 79 నామినేషన్లు దాఖలు చేయగా శనివారం 31 మంది అభ్యర్థులు 48 నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో మొత్తం నామినే షన్ల సంఖ్య 127 నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వివేకానందలతో కలిసి వచ్చి తన మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు వేసిన వారిలో నిరుద్యోగులు, ఆర్ఆర్ఆర్ బాధితులు, సామాజిక తెలంగాణ ఉద్యమకారులు ఉన్నారు. లోకతాం త్రిక్ జనతాదల్ పార్టీ నుండి అభినయ్ దర్శన్, తెలుగు రాజ్య అధికార సమతి నుండి మీసాల కృష్ణ, మజ్లిస్ ఇతెహాద్ మిలత్ పార్టీ నుండి తాహెర్ కమల్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో ఒకరు మినహా 14 మంది రెండో సెట్ నామి నేషన్‌ను దాఖలు చేశారు. బీజేపీ నుండి లంకల దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆయనకు సంబంధించిన తొలి నామినేషన్‌ను దాఖలు చేయగా, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు.

## సల్మాన్ ఖుర్షీద్‌కు సద్భావన అవార్డు ప్రధానం

**చార్మినార్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన చార్మినార్ వద్ద జరగనున్న కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి. సిడబ్ల్యుసి సభ్యులు సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావన అవార్డును ప్రధానం చేయనున్నామని సమితి ప్రధాన కార్యదర్శులు జి.ఆనంద్, సయ్యద్ షా ముజాహిద్ హుస్సేన్ నీలు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరగనున్న కార్యక్రమం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీ పీసీసీ అధ్యక్షులు, ఎంఎల్ సి మహేష్ కుమార్ గౌడ్, తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని వారు తెలియజేశారు. రాష్ట మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభకు అధ్యక్షత వహించనున్నారని వారు తెలిపారు.

## మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్‌ల దుర్వినియోగంపై చర్యలు

**సికింద్రాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ డీజీ డ్రగ్ కంట్రోలర్ షానవాజ్ కాసిం ఐపీఎస్ ఆదేశాల అనుసారం సికింద్రాబాద్ డగ్ ఇన్స్పెక్టర్ గోవింద్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సీతాఫల్‌మండి నామాలగుండు లో అక్రమంగా నిల్వచేసి విక్రయించిన మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్‌ల నిల్వలను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎం.నరేశ్ అనే మెడికల్ వ్యాపారి నుంచి గుండె ఉద్దీపన మందులు టెర్మిన్ ఇంజెక్ష న్లు, టెర్మివా ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. జిమ్‌లలో బాడీ బిల్డింగ్ దుర్వినియోగం కోసం ఈమందులను జిమ్‌కు వెళ్లేవారికి చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నారు. త్వరగా బాడీ బిల్డప్ చేసుకోవాలని అత్యాశతో ఈ మధ్యకాలంలో వీటి ఉపయోగం వల్ల మరణాల సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు.

## నేడు ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం


సదర్ సమ్మేళన సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

**ముషీరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** నేడు లోయర్‌ట్యాంక్ బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ 2025 ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం జరగనుందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.అంజన్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఎన్టీఆర్ స్టేడియం వద్ద కొబ్బరికాయ కొట్టి, గోపూజ నిర్వహించారు. అనంతరం అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ యాదవ ప్రతిష్టాత్మక సదర్ సమ్మేళన్ రాజకీయ పార్టీలకు, కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా జరగుతుందని, ఈ సదర్ సమ్మేళనానికి అందరూ విచ్చేసి, జయప్రదం చేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన యాదవులు హాజరయ్యారు.

## విద్యార్థులలో పఠనాభిలాషను పెంపొందించాలి


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** చదువు అంటే కేవలం పాఠ్యపుస్తకాలు ఉన్నదే కాదు మనం పరిశీలించే ప్రతి విషయం కూడా చదువుగానే భావించాలని, పఠనాభిలాష పెంపొందించుకోవాలని డాక్టర్ ప్రత్తిపాక మోహన్ తెలిపారు. తిరుమలగిరి లాల్ బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించి రాసిన కొన్ని కథలను కథా మంజరి అనే పుస్తక రూపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవడం అనేది ఒక అలవాటుగా మార్చుకోవాలని, అన్ని రకాల పుస్తకాల్లో చదివి సొంతంగా రాసే అలవాటు చేసుకోవాలని విద్యార్థులకి చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ఈ దిశగా ప్రోత్సహించాలని కోరారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ వీరలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి కథలు చదవడమే అవసరమని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భరద్వాజ మాట్లాడుతూ పిల్లల్లో పఠనాభజలాషను పెంపొందించేందుకు ఈ విధమైన సేకరణకథలు తెలుగు టీచర్లు డా.ఆర్.కృష్ణమూర్తి,శాస్త్రుల శ్రీనాథశర్మ గారలు చేయడం చాలా అభినందనీయమని కొనియాడారు. పూర్వ ప్రధానోపాధ్యాయులుగారు రమణమూర్తి గారు చక్కని సృజనాత్మక కార్యక్రమాన్ని చేపట్టారని అభినందించారు. సేకరణ కథలు అందించిన 53 మంది పిల్లలకు ప్రశంసాపత్రాలను ముఖ్య అతిథి, విశిష్ట అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేసారు. రమణమూర్తి, వీరలక్ష్మీ తదితరులను

## ప్రజల ఆశయాలను నెరవేరుస్తాం : నవీన్ యాదవ్


మధురానగర్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ప్రజల ఆశయాలను నెరవేర్చే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని వెంగళ్‌రావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరుతున్నాయని ప్రజలంతా పథకాలతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.

## పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు

### - ఎఐసిసి సభ్యుడు శక్తిసిన్హ్ గోయల్


సమావేశంలో మాట్లాడుతున్న శక్తిసిన్హ్ గోయల్, చిత్రంలో దానం నాగేందర్, గద్వాల్ విజయలక్ష్మి, విజయారెడ్డి తదితరులు ఉన్నారు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని రాజ్యసభ సభ్యుడు, ఏఐసీసీ సభ్యుడు శక్తిసిన్హ్ గోయల్ అన్నారు. బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో శనివారం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడి పదవీ కాలం ముగుస్తుండటంతో నూతన అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవిపై ఆసక్తి ఉన్న వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గతంలో యూత్ కాంగ్రెస్ పదవుల విషయంలో ఎలా పారదర్శకంగా వ్యవహరించామో, ఈ ఎన్నికలోనూ అలానే ఉంటామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి, కార్పొరేటర్లు మహాలక్ష్మి, వనం సంగీతయాదవ్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్‌లపై బిజెపి ఎందుకు అడ్డుపడుతున్నది


ప్రదర్శన నిర్వహిస్తున్న పలు పార్టీల నాయకులు

**సైఫాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బలహీన వర్గాలైన బిసిలకు రాజ్యాధికారం లభించేంతవరకు ఉద్యమిస్తామని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (యు) వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రమోని పురుషోత్తం చెప్పారు. శనివారం బిసి జెఎసి ఆధ్వ ర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా పలు పార్టీలు బషీర్‌బాగ్ నుం చి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ప్రద ర్శన నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు అసోం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్కాపూర్ మార్కెట్ వ్యాపారులకు ట్రాఫిక్ పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్.

**మెహిదీపట్నం అక్టోబర్ 18, ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ లోని వ్యాపారులకు శనివారం మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తల్లారి మల్లేష్ ముదిరాజ్ అధ్యక్షతన ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సౌత్ వెస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాస్, గోషామహల్ ట్రాఫిక్ ఏసిపి డి. ధనలక్ష్మి కుల్సుంపుర ఇన్ స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ లు హాజరై మాట్లాడారు.. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ , పూల మార్కెట్, రిటైల్ మార్కెట్ లకు నిత్యం వేలాదిమంది రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారులు వస్తుండడంతో మార్కెట్ పరిసరాలని నిత్యం రద్దీగా మారుతున్నాయని తెలిపారు. వేలాది మంది మార్కెట్ కు వస్తుండడంతో మార్కెట్ లతో పాటు మార్కెట్ రహదారి అంతా ట్రాఫిక్ మయంగా మారుతుందని, ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే ట్రాఫిక్ పోలీసులు సూచించిన విధంగా వాహనాలను నడపాలన్నారు. సరైన మార్గదర్శకాలతో వాహనాలు నడిపితే ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చు తెలిపారు. అదేవిధంగా మార్కెట్ లోని వ్యాపారులు కూడా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. రైతులు సరుకు లతో మార్కెట్ కు వచ్చాక ఖాళీ అయిన వాహనాలని వెంటనే బయటికి పంపించి వేయాలని సూచించారు. కమిషన్ దారులు తమ వాహనాలను గుడి ప్రాంగణంలో పార్కింగ్ చేయాలన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ... పండుగల సమయంలో గుడిమల్కాపూర్ మార్కెట్ లకు వేలాది మంది కొనుగోలుదారులు వస్తుండడంతో మార్కెట్‌లో ట్రా ఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు సిబ్బందిని కూడా అదనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులకు అందుబాటులో ఉంటూ వారి సూచనలను తప్పకుండా అమలు చేస్తుండడంతోనే ట్రాఫిక్ సమస్య కొంతమేర పరిష్కరించడం జరుగుతుందన్నారు.సమావేశంలో మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్‌నాయక్,అధికారులు వ్యాపారులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ల కోసం బిసి సంఘాలకు ఎంఆర్‌పిఎస్ మద్దతు : మందకృష్ణమాదిగ

**బేగంబజార్,అక్టోబర్ 18ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు బిసిలకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మద్దతు ఉంటుందని వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ స్పష్టం చేశారు.సుప్రీంకోర్టులో బిసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్లు చెల్లవు అని తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బిసి సంఘాలు ఇచ్చిన తెలంగాణ బంద్ పిలుపు మేరకు శనివారం మహాత్మాగాంధీబస్ స్టేషన్‌లో నిర్వహించిన బంద్‌లోమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ,టిపిసిసి అధ్యక్షులుమహేష్‌కుమార్‌గౌడ్,బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ శాసనసభ్యులు శ్రీశైలంగౌడ్, చంద్రమోహన్ యాదవ్, వందలాది మంది బిసి సంఘాల నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కోసం బిసి సంఘాలు చేపట్టిన పోరుబాట సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు.మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోబస్సులు రాకపోకలు సాగించలేదు.ప్లాట్ ఫారాలపై బస్సులు నిలిచిపోయాయి.ముందు జాగ్రత్త చర్యగా ఎలాంటి అవాం చనీయ సంఘటనలు జరగకుండా ఈస్ట్‌జోన్ డిసిపి బాల స్వామి ఆధ్వర్యంలోసుల్తాన్‌బజార్ ఎసిపి ఎం.మట్టయ్య పర్యవేక్షణలో అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి తన సిబ్బందితో పోలీసు బందో బస్తు చేపట్టారు.మధ్యాహ్నం తరువాత రహదారులపై బస్సులను నడిపించారు.మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి సాయంత్రం బస్సుల రాకపోకలను ప్రారంభించారు.

## 7నెలలవుతున్న కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి జీతాలు లేవు



ధర్నాలో పాల్గొన్న ఏ.ఐ.టియూసి నాయకులు,కాంట్రాక్ట్ నర్సింగ్ కార్మికులు

**అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 18ప్రభాతవార్త:** గత ఏడు నెలలుగా కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడం సిగ్గు చేటు అని ఏ.ఐ.టి.యూసి నాయకులు ఎం.డి యూసుఫ్,ఎం. నరసింహులు విమర్శించారు.శనివారం కోఠిలోని డిఎంఈ పరిధిలోని టిమ్స్ఆసుపత్రి ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈసంవత్సరం ఏప్రిల్ నుండి సుమారుగా జీతాలు రావటంలేదన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ పద్దతిలో విధులను నిర్వహిస్తున్న నర్సింగ్‌కు జీతాలు ఇవ్వకపోవడం పట్ల వారు అగ్రహం వ్యక్తం చేశారు.అనేక సార్లుడి.ఎం.ఇకి వినతిపత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.జీతాలు లేకపోవడం మూలంగా వారి కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందన్నారు.అప్పులు ఎంత వరకు ఇస్తారనిప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఏడు నెలల నుంచి అధికారులు ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో తీవ్రనిర్లక్ష్యాన్ని వహించడం క్షమించరాన్ని నేరమన్నారు.అకాడమి డి.ఎం.ఇ డాక్టర్ కె.శివరాం ప్రసాద్‌ను కలిసి కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది సమస్యలను విన్నవించినట్లు తెలిపారు.వారు స్పందిస్తూ వీలైనంతతొందరగా జీతాలు చెల్లించేందుకుగాను ప్రయత్నిస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏ.ఐ.టి.యూ.సి హైదరాబాద్ జిల్లా ఉప కార్యదర్శి బి.కిషన్,నర్సింగ్,మహిళా నాయకురాలు రజిత,స్వాతి,వి జయలక్ష్మి,స్వప్న,మేఘమాల,సంగీత,సౌందర్య పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి బిజెపి ప్రాధాన్యం

### -డివిజన్ పార్టీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్


అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్ గుండలోని భానోదయ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో వీధిలైట్ల పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్

**చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** అడిక్‌మెట్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బిజెపి ముందుంటుందని స్థానిక డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ అన్నారు. ఇందులో భాగంగా శనివారం డివిజన్ పరిధిలోని రామ్‌నగర్ గుండలోని భానోదయ అపార్ట్‌మెంట్ నివాసి సంపత్ వినతిమేరకు సిపిడిసిఎల్ అధికారులకు వెంటనే పిలిపించి గత కొన్ని రోజులుగా వెలగని వీధిలైట్లను పునరుద్దరింపచేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు కూడా ఎటువంటి ఫిర్యాదులున్నా తమకు వివరిస్తే వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

## 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీడిమెట్లలో ఖోఖో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి ఐ.విజయ కుమారి విచ్చేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీక కిష్టయ్య, ఎంఈఓ జెమిని కుమారి, కొంపల్లి ఎంఈఓ కృష్ణ, డైసో హైదరాబాద్ సుధాకర్, మోడరన్ ఇండియా ఇంజనీర్స్ మోహన్, క్రాంతి కిరణ్, మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, కుత్బుల్లాపూర్ జోనల్ సెక్రెటరీ అరుణ జ్యోతి, వివిధ జోనల్ సెక్రెటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్‌తో అసభ్య ప్రవర్తన

### - బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కార్పొరేటర్‌తో ఒక కాంగ్రెస్ నేత అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబధించి శనివారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ పరిశీలకుడు శక్తిసిన్హ్ గోయల్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతోపాటు సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీరమణగౌడ్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు హాజరయ్యారు. శక్తి సిన్హ్ గోయల్‌తో సవవేశమయ్యేందుకు వీరంతా ఆయన గది బయట నిలబడి ఉన్నారు. అదే సమయంలో సమావేశానికి హాజరైన పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత గడ్డం శ్రీనివాస్‌యాదవ్ వనం సంగీతయాదవ్‌ను చేయి పెట్టి నెట్టివేయడమే కాకుండా అసభ్య పదజాలాన్ని ఉపయోగించాడు. అంతటితో ఆగకుండా అసభ్యంగా తాకడమే కాకుండా అక్కడే ఉన్న భారతీనాయక్, మహాలక్ష్మీతో సైతం అలానే ప్రవర్తించాడు. 'పోవే బయటకు' అంటూ దురుసుగా ప్రవర్తించాడు. గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలంటూ వనం సంగీతయాదవ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎసిపి నరేశ్‌రెడ్డి


జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**జీడిమెట్ల అక్టోబరు18, ప్రభాతవార్త :** సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టిన పోలీసులు చిరస్మరణీయులని బాలానగర్ సహయ పోలీసు కమిషనర్ పింగళి నరేశ్‌రెడ్డి కొనియాడారు. ఈ నెల 21న నిర్వహించే పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీడి మెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్‌తోపాటు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 400మంది పైచిలుకు పోరులు తలసేమియా వ్యాధి గ్రస్తులతో పాటు రోడ్డుప్రమాదానికి గురై చికిత్సపొందే వారికి రక్తదానం చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రక్తదాతలకు ఉచితంగా హెల్మెంట్, భోజన ప్యాకెట్,ఫ్రూటీ, నీళ్లబాటిల్, పళ్లతోపాటు బిస్కెట్లను అందజేశారు.

## బిసిబిల్లుకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలి

### -మంత్రి వాకిటి శ్రీహరి


ఆర్టీసి ముషీరాబాద్ డిపో వద్ద ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**చిక్కడిపల్లి అక్టోబరు18,ప్రభాతవార్త :** బిసి రిజర్వేషన్ ల అమలు విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. బీసీ బంద్ పిలుపులో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ముషీరాబాద్ డిపో వద్ద రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా జరిగిన ధర్నాలో మంత్రి వాకిటి శ్రీహరి బీసీ బంద్ లో ఈ ధర్నాలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసి బిల్లు అమలు విషయంలో ఒకడుగు ముందుకేసి జిఓ జారీ చేసి బిసి పట్ల తమకున్న బాధ్యతను నెరవేర్చిందని, కానీ కొంత మంది కుట్రల ఫలితంగా కోర్టుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. . బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బిల్లులను కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా 42 శాతం బీసీ రిజర్వేషన్ ఇచ్చే కమిటీ మెంట్ తమకు ఉందన్నారు. అధికారంలో ఉండి కూడా బంద్ లో పాల్గొన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీనవర్గాల పక్షాన ఉంటుందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ పై బీఆర్ ఎస్ అనవసర ఆరోపణలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముగ్గురు బీసీ మంత్రులు ఉన్నా కూడా 50 శాతం రిజర్వేషన్లు చాలని ఎన్నికలకు పోయిన మీరా తమ గురించి మాట్లాడేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు తమపై ఆబండాలు వేసి పబ్బం గడుపుతున్నారని ఫైర్ అయ్యారు. ఎవ్వరు ఎన్ని ఆరోపణలు చేసినా.. అసత్య ప్రచారాలు చేసినా 42 శాతం బీసీ రిజర్వేషన్ ఇచ్చి తీరుతమన్నారు మంత్రి స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, బింగి సాయి కీర్త్ (బాబ్జి) , మారిశెట్టి నరసింగ రావు, అనీల్‌యాదవ్, గుర్రం శంకర్, అభిషేక్ కెన్నడీ, సురేష్ యాదవ్, వెంకట్, కర్ణాకర్ పెద్ద సంఖ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్‌ను ఢీ కొన్న కంటైనర్ వాహనం

**-రెండుగా చీలిపోయి వస్తువులన్నీ నేల పాలు**
**-అక్కడే ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**
**-సూచిక బోర్డులు లేకపోవడంతోనే ప్రమాదాలు**


పీ అండ్ టీ ఫ్లై ఓవర్ ను ఢీ కొట్టిన గూడ్స్ వాహనం.

**బేగంపేట అక్టోబరు 18,ప్రభాతవార్త** అధికారులు నిర్లక్ష్యం మరో ప్రమాదానికి కారణమైంది. బేగంపేట ప్రకాశంనగర్ (పీఅండ్‌టీఫ్లైఓవర్) వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.తాజాగా హర్యానా నుంచి మధురై వైపు ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ శనివారం ఉదయం గం 6ల సమయంలో బేగంపేట ప్రకాశంనగర్ (పీ అండ్ టీ) ఫ్లై ఓవర్ పిల్లర్‌ను వేగంగా ఢీకొంది.దీంతో కంటైనర్ లారీ పైకప్పు సగం పైగా లేచిపోయింది.దీంతో వాహనం లోని వస్తువులన్నీ కింద పడిపోయాయి.అయితే ప్రమాదం జరిగిన సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.కొంత సమయం వాహనం అక్కడే ఉండిపోవడంతో ట్రాఫిక్ కు స్వల్పంగా అంతరాయం కల్గింది.వెంటనే జేసీబీ సహాయంతో వాహనాన్ని అక్కడి నుంచి తొలగించడంతో ట్రాఫిక్ యధావిధిగా సాగింది.ఇదే ప్రాంతంలో అమీర్‌పేట,పంజాగుట్టల నుంచి వచ్చే వాహనాలు యూటర్న్ తీసుకునే ప్రాంతం కావడంతో కొంత అసౌకర్యంగా మారింది.ప్రతిసారీ ఇదే ప్రాంతంలో రెండూ వైపులా ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారులను అప్రమత్తం చేయడంలో అధికారులు వైఫల్యం చెందారు అని స్పష్టంగా పేర్కొనవచ్చు.బేగంపేట ప్రధాన రోడ్డులో ఉన్న ప్రకాశం నగర్ ఫ్లై ఓవర్ కింద రెండు మూడు పిల్లర్లు తక్కువ ఎత్తులో ఉంటాయి.అయితే ఈ సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారులు ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి తెలియజేయాల్సి ఉంది.ఫ్లై ఓవర్ ప్రారంభంలో రెండు వైపులా (ఫ్లై ఓవర్ పిల్లర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఇక్కడ ప్రమాదం జరిగే అవకాశం ఉందంటూ) హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లైతే వాహనదారులు ఇది గుర్తించే అవకాశం ఉంటుంది.ఇక్కడ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం,పిల్లర్లకు ప్రమాదాన్ని తెలియజేసేలా ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.అయినా సంబంధిత శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తుంది.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలియజేసారు.

**ఫ్లై ఓవర్ కు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**

ప్రకాశం నగర్ (పీఅండ్‌టీ) ఫ్లై ఓవర్ కి రెండు వైపులా ఫ్లై ఓవర్ పిల్లర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి.ప్రమాదం జరిగే అవకాశం ఉందంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.అయితే అధికారులు ఇలాంటి బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఇది గుర్తించలేని డ్రైవర్లు తమ వాహనాలతో పిల్లర్లను ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల విస్తృత కార్యకర్తల సమావేశం


-ప్రసంగిస్తున్న టియుజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

**చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న టియుజేఏసీ అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల చేసే కార్యక్రమం శనివారం చిక్కడపల్లి సెంట్రల్ ఆఫీస్ టియుజేఏసీ రాష్ట్ర సమావేశంలో ప్రకటించారు. మొదటి విడత అభ్యర్థులను ఫైనల్ చేసిన టియుజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎన్నికలు, తెలంగాణ ఉద్యమకారుల పోటీ, ఎన్నికల రాజకీయ అంశాల పై విస్తృత కార్యకర్తల సమావేశం జరిగింది, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ లు వివరించారు మొదటి విడతలో బోయపల్లి రంగారెడ్డి, ఎం, శంకర్రావు, ఏ,హరి ప్రసాద్, ఒగిరాల సుజి, అంజలి కుమారి, సుచరి, బాకారం లావణ్య, బాల లక్ష్మి, మాధవి, సూర్య కళ, అని, ధనలక్ష్మి, స్వరూ, బి,ఆర్, హరికృష్ణ, జి, రవి, పి, రాము, కే, సాయిలు, యాదగిరి, బి,రాజు, ప్రవీణ్ కుమార్, హర్ ప్రీత్ సింగ్‌లు పోటీ చేసే అభ్యర్థుల మొదటి లిస్టు ఇది అని అన్నారు. , త్వరలోనే మరి కొంత మంది పోటీ చేసే అభ్యర్థుల లిస్టును ప్రకటిస్తామని వారు అన్నారు, ఉద్యమకారులను విస్మరించిన అన్ని పార్టీలను ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని వారు అన్నారు,

## ఎఐఎస్‌సిఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడిగా బాలకృష్ణ ఎన్నిక

**సైపాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటి జాతీయ అధ్యక్షుడిగా కె.బాలకృష్ణ ఎన్నికైనారు. సలహాదారులుగా జి.శంకర్, ఆర్.అంజయ్య, కె.డి.రమేష్, గౌరవ అధ్యక్షుడిగా మాస్టార్జీ, ఎస్.రాజుఉస్తాద్, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా ఎస్.గంగాధర్, పిల్లి మోహన్, ఎ.దుర్గయ్య, సెక్రటరీ జనరల్‌గా రాయల్ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా పి.జగన్నాథం, ప్రమోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బిట్లా వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, ఎ.నర్సింగ్‌రావు, ఎ.శ్రీరాములు, డి.మునుస్వామి, కార్యదర్శులుగా వై.బాలరాజు, పి.బల్వంత్, పాల్గడుగు శ్రీనివాస్, కోశాధికారిగా ఇ.సత్యనారాయణ నియమితులైనారని అధ్యక్షుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-19, SLPZ, GHMC, యూసఫ్‌గూడ, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం.27/EE/DIV No.19/SLPZ/GHMC/2025-26, తేదీ: 18.10.2025
నిట్ నం: పైన పేర్కొన్నది. పనుల సంఖ్య: (1) నం. ఎలక్ట్రిక్ పని. అంచనా మొత్తం రూ.లక్షలలో: 6.10. ప్రారంభ తేదీ/డౌన్‌లోడ్ ముగింపు తేదీ, సమయం: 21.10.2025 ఉ.12.00 గం. 24.10.2025 ఉ.12.00 గం. వరకు మాత్రమే. అధికారి పేరు, చిరునామా: EE, డివిజన్-19, GHMC, శ్రీ బి. భద్రు 99899-30549. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, (SLPZ), GHMC
DIPR.No.9466-PP/CL/Advt/1/2025-26, తేదీ: 18.10.2025



**IN THE COURT OF HON'BLE Prl JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DIST, AT: MEDCHAL.**
**O.S.No. 693 of 2025**
BETWEEN:
**Smt. Parabathulla Aruna & othrs** ...Plaintiff
And
**1. The Tahsildar,** Bachupally Mandal, Medchal Malkajgiri District, Telangana.
**2. ALL CONCERN** ...Defendants

WHEREAS the above-named Petitioner/ Plaintiff has made as application to this Court Under Order VII Rule 1 & 2. You are i.e., D2 hereby wanted to appear in this court in person or by a pleader duly instructed on the 03th day of November 2025 at 10:30 O' Clock in the forenoon to show cause of against the application, failing which the said application will be heard and determined experty.
(BY ORDER OF THE HON'BLE COURT)
**M/s M. RAVINDER REDDY**
**PALLE RAJASHEKHAR**
**K. RAMESH GOUD**
**ADVOCATES**
H.No: 13-6-460/19, Mahesh Nagar, Shivbagh, Near Gudimalkapur, Vegetable Market, Hyderabad, Telangana-500028.
**Cell No: 9849157351.**

**PUBLIC NOTICE**
It is hereby informed to all the General Public that my client **Sri. Kolloju Nikhil Chary** S/o. Late Kolloju Padma Chary had lost the Original documents belonging to his deceased mother i.e., Registered Sale Deed bearing document No. 293/2001 dated 11.01.2001 and also its link document vide Registered Sale Deed bearing Document No. 12633/1987 Dated 28.9.1987. The said documents were lost on the date of his father's demise. Accordingly, my client had lodged a complaint to the Police, Vanasthalipuram requesting necessary action. Any person who finds the aforesaid documents is requested to kindly return them to the undersigned. The public is cautioned that any misuse or unauthorized use of the said documents shall be treated as illegal and will not bind my client in any manner. Hence this Public Notice.
**Sd/- M. LAXMA REDDY**
**ADVOCATE**
#409, 4th Floor, L.P.T. Market, L.B. Nagar, Hyderabad.
**Cell: 9000751761, 905913779.**

**IN THE COURT OF THE HON'BLE III ADDL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT L.B.NAGAR**
**I.A. No. 701 of 2024**
**In**
**O.S. No. 1293 of 2018**
Between:
**Mr. Y. Sudhakar Reddy** ...Petitioner/Petitioner/ Plaintiff
And
**Smt. T. Sony Goud ...Respondents/ Respondents/Defendants**
**To: Proposed Defendant No.2**
**B. Sanga Reddy** S/o B. Laxma Reddy aged about 50 years, Occ: Agriculture, R/o H.No. 18-13-7/162/2, Indira Nagar, Bandlaguda, Hyderabad-500005.
**NOTICE**
The Petitioners / Petitioners/ Plaintiffs have filed above suit for Perpetual Injunction in respect of the suit schedule property i.e., Open land bearing Plot No. 6 admeasuring 184 sq.yards and another Plot bearing No. 7 admeasuring 186 sq.yards total admeasuring 370 sq.yards both situated in Sy.No. 46, Ward No. 9, Block No. 10, Roshandowla Village, Saroor nagar Mandal, Ranga Reddy District, bounded by : North: Plot No.8, South : Plot No.5, East : 30' feet wide Road and West : Neighbours land, in the said IA No. 701/2024, you are the proposed defendant No.2. Therefore the said case is posted to **04-11-2025 at 10.30 A.M.** for your appearance personally or through an advocate in the above said court, failing which, the matter will be decided on merits.
(BY ORDER OF THE COURT)
**Sd/- KOTHA JANARDHAN REDDY**
**ADVOCATE**
7-260/1, KJR Residency, Karmanghat, Shakthinagar, Near TKR Kaman, Hyderabad-97

**PUBLIC NOTICE**
General public is hereby informed that my client **Mr. ALAVALA NAGI REDDY** on 18.07.2025 while taking Xerox he had last his original link document bearing No. 10344/1993, registered in the office of SRO, Hyderabad East, relating to piece and parcel of the open land bearing Plot No.75, admeasuring 200 Sq. Yds, in Sy. No.222 (Part), Ward No.4, Block No.8 of GHMC, situated at Satyanagar Colony of Bagh Hayathnagar Village, Hayath Nagar Revenue Mandal, Ranga Reddy District, T.G and not traced till date despite his best personal efforts. Hence anyone, who finds this original deed is hereby requested to handover the same to the undersigned and receive suitable remuneration.
**K V L NARASIMHA RAO**
**ADVOCATE**
Flat No.G-2, H.No.1-6-169, SRI SESHKAMAL ARCADE PHANIGIRI COLONY, CHAITANYAPURI, Hyderabad-060,
**Cell No.9703190595**

## బిసిలకు సమాన హక్కులు కల్పించాలి

**: వీరభద్రీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వ కొండయ్య**



దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన నిర్వహిస్తున్న తెలంగాణ వీరభద్రీ సంఘం నాయకులు చెవ్వ కొండయ్య, కాటపల్లి వీరస్వామి, మిట్టపల్లి జగ్గయ్య, కడెం రాజు తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 18, ప్రభాతవార్త:** బీసీలకు సమాన హక్కులు కల్పించాలని వీరభద్రీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వ కొండయ్య, కాటపల్లి వీరస్వామి లు పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం చేపట్టిన బీసీ బంద్ కు మద్దతుగా తెలంగాణ వీరభద్రీయ్య సంఘం కేంద్రం కమిటీ ఆధ్వర్యంలో దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వ కొండయ్య, కాటపల్లి వీరస్వామి లో మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ కూ వీరభద్రియ కులం సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడెం రాజు, కడెం సంజయ్ కుమార్, కాటపల్లి మధు, కాటపల్లి మల్లికార్జున్, కడెం ప్రదీప్, కాటపల్లి సాయి కిషోర్, కాటపల్లి సతీష్, కాటేపల్లి విగ్నేష్, రవికుమార్, ఎల్లయ్య, విటల్, రాజు, నర్సింగ్ దాస్, తిరుమల్, బాలరాజ్, బాలు మహేందర్, నరసింహ, కాలేశ్వర్, బాలరాజ్, యశ్వంత్, ఆకాష్, కొండల్, కాటపల్లి టికారం తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కార్పొరేటర్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నవజీవన్ రెడ్డి.

**హయత్ నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** దుర్గా నగర్ కాలనీలో త్వరలోనే పూర్తి స్థాయిలో డ్రైనేజీ పైప్ లైన్ ఏర్పాటు చేయించి ప్రజలకు సమస్య లేకుండా చూస్తామని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ లోని శ్రీ దుర్గా నగర్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ఆయన శనివారం జలమండలి అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... కాలనీ లోని మిగిలిన విధుల్లో కూడా పూర్తి స్థాయి లో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ ఏర్పాటు చెయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... కాలనీ లో పూర్తిస్థాయి లో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించాలని జలమండలి మేనేజర్ వాహినికి సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బీరప్ప యాదవ్, సభ్యులు రవి గౌడ్, సత్యనారాయణ, వీరస్వామి గౌడ్, శంకర్ రావు, పుష్ప లత, సావిత్రమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

### తిరుమల నగర్ కాలనీలో కెమెరా మైక్ అనౌన్స్‌మెంట్ ఏర్పాటు



**మల్కాజిగిరి అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మల్కాజ్గిరి సర్కిల్ 139 ఈస్ట్ ఆనందబాగ్ డివిజన్ తిరుమల నగర్ యందు నిఘా కెమెరా మైక్ అనౌన్స్మెంట్ ఏర్పాటును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మరియు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. తిరుమల్ నగర్ కాలనీ అధ్యక్షులు నర్సింగరావు మరియు సభ్యులు అభ్యర్థన మేరకు బహిరంగ చెత్త ఏయూ ప్రాంతంలో తన సొంత నిధులతో కార్పొరేటర్ నిఘా కెమెరా మైక్ అనౌన్స్మెంట్ ఏర్పాటు చేయించారు. శనివారం మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించి కాలనీ సభ్యులను మరియు కార్పొరేటర్ గారిని అభినందించారు. బహిరంగంగా చెత్త వేయు ప్రాంతాలలో ఇటువంటి టెక్నాలజీలు ఉపయోగించి ఎవరైతే చెత్త వేయుచున్నారు అట్టి వారిని గుర్తించుటకు సీసీ కెమెరా మరియు వేయకుండా హెచ్చరికలు తెలుపు మైకు అనౌన్స్మెంట్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపినారు. కార్యక్రమంలో వై ప్రేమ్ కుమార్ కార్పొరేటర్, తిరుమల నగర్ కాలనీ అధ్యక్షులు నర్సింగరావు మరియు సభ్యులు, సిహెచ్ శ్రీనివాస్ శా.సూపర్వైజర్ మనీషా అంజయ్య యాదగిరి సూపర్వైజర్స్ మరియు పోతుల వినోద్ యాదవ్, నర్సింగరావు, రాందాస్ సంతోష్ ముదిరాజ్, వెంకటేశ్వరరావు, చుంకు శ్రీనివాస్ కన్నా యాదగిరి, ఇస్త్రారీ, తదితరులు పాల్గొన్నారు

## గాయత్రీ నగర్ ఫేస్ 2 అభివృద్ధికి కృషి : లచ్చిరెడ్డి



గాయత్రీ నగర్ ఫేస్ 2.ప్రతినిధులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. అక్టోబర్.18.ప్రభాతవార్త.** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ ఫేస్ 2 కాలనీ నూతన కార్యవర్గం ఏర్పరచుకున్న సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారిని వారి కార్యాలయంలో కలిసి కాలనీలో అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చందన్ నాయక్, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, ట్రెజరర్ శరత్ బాబు, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, సుధాకర్, జాయింట్ సెక్రటరీ గణేష్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, లీగల్ అడ్వైజర్ చంద్రశేఖర్, శంకర్, కార్యవర్గ సభ్యులు ఖాజా హుస్సే, ఏడుకొండలు, బుర్రహుద్దీన్, బాలకృష్ణ ఉన్నారు.



బిసి బంద్ కు మద్దతుగా ముసారాంబాగ్ లో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కూరెల్ల మహేష్ కుమార్, నాయకులు శ్రీనివాస్, సతీష్ మహాజన్, చంద్రశేఖర్ తదితరులు



మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో వ్యాపార కార్యకలాపాల నిలిపివేసి బీసీ బంద్ కు మద్దతు తెలియజేస్తున్న తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, డైరెక్టర్లు మాదారం కృష్ణ, దుగ్గు జగదీష్, తదితరులు



42 బిసి రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో బంద్ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.



బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దిల్ షుక్ నగర్ లో ర్యాలీ నిర్వహిస్తున్న అనంతయ్య, నీల వెంకటేష్ తదితరులు



మన ఆలోచన సాధన సమితి(మాస్) ఆధ్వర్యంలో బండ్లగూడ బస్ డిపో వద్ద ఆందోళన చేస్తున్న కటకం నర్సింగరావు



బీసీ ఆకుల సాధన సమితి ఆధ్వర్యంలో నాగోల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బొడ్డుపల్లి కృష్ణ తదితరులు



బిసి రిజర్వేషన్లకు మద్దతుగా ఉప్పల్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు



బోడుప్పల్లో బీసీ బంద్ ధర్నాలు పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజేష్ యాదవ్ , మాజీ మేయర్ అజయ్ యాదవ్ , పోగుల నరసింహారెడ్డి ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు



ఉప్పల్ డిపో ఎదుట ధర్నా కార్యక్రమంలో రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు



మన ఆలోచన సాధన సమితి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌లో మాస్ సభ్యులతో కలిసి పాల్గొన్న నర్సింగ రావు



బిసి సంఘాల బంద్‌కు మద్దతుగా బడంగ్‌పేట్‌లో పర్యటిస్తున్న చిగిరింత నర్సింహారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు



బిసి రిజర్వేషన్లకు సంఘీభావంగా ఐక్యత తెలుపుతున్న మీర్‌పేట్ కార్పొరేషన్ బిసి నాయకులు



బిసి బంద్ సందర్భంగా రామంతాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు



బిసి బంద్‌కు మద్దతుగా రామంతాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

# తెలంగాణ బంద్ విజయవంతం

## మహేశ్వరం మినీ ట్యాంకుబండ్ జిల్లెలగూడ చందన చెరువు పరిశీలన

### చేపట్టాల్సిన పనులు, మరమ్మతులపై సబితారెడ్డి దిశానిర్దేశం



సుందరీకరణ జిల్లెలగూడ చందన చెరువును పరిశీలించి సూచనలు చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోనే మినీ ట్యాంకు బండ్‌గా తీర్చిదిద్దిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందన చెరువును మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. సుందరీకరణ చేయడం ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని, వాకర్స్ కు ఆరోగ్యాన్ని అందిస్తున్న చెరువు స్థితిగతులపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డిఇఇ వేణుగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ అశోక్, పలువురు నాయకులతో కలిసి ఆమె పాదయాత్రలు చేస్తూ పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి చెరువులో చుక్క డ్రైనేజీ నీరు కూడా చేరకుండా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశనం చేశారు. రాత్రి వేళల్లో వాకర్స్ కు ఇబ్బందులు లేకుండా ట్రాక్‌పై విద్యుత్ దీపాలు నిరంతరం వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి విరిగిపోయిన గ్రిల్స్ కు మరమ్మతులు చేయించాలని ఆమె ఆదేశించారు. క్రీడా ప్రాంగణంలో పాడైన పిల్లల ఆటల పరికరాలను సైతం మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ఆమె సూచించారు. వర్షాలు పడే సమయంలో వాకర్స్ కు ఇబ్బందులు లేకుండా అనువైన చోట షెడ్డును ఏర్పాటు చేయాలని సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. చెరువు వద్ద అదే విధంగా పరిసరాల్లో దోమల ఉధృతి ఉన్నందున ఫాగింగ్ చేయిస్తుండాలని అన్నారు. నిర్దేశిత పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ పదవులు : ఏఐసిసి నేత డా.అంజలి నింబాల్కర్





ఉప్పల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎఐసిసి పరిశీలకురాలు డా.అంజలి నింబాల్కర్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడి నియామకం కార్యకర్తల అభిప్రాయం మేరకే జరుగుతుందని ఎఐసిసి పరిశీలకురాలు డా.అంజలి నింబాల్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ శ్రీరస్తు పంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎఐసిసి పరిశీలకురాలు డా.అంజలి నింబాల్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సూచన మేరకే పార్టీ పదవులు నియమిస్తామని, పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బూత్ స్థాయి నుంచి పార్టీ నేతల వరకు ప్రతి ఒక్కరి నుంచి అభిప్రాయాలకు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, పలువురు డివిజన్ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన హోమియోపతి ఎక్స్‌పో



హోమియోపతి ఎక్స్‌పో -2025 కార్యక్రమంలో పాల్గొన్న హోమియో కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** రామంతాపూర్ హోమియోపతి కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన హోమియోపతి ఎక్స్‌పో -2025 కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని అయూష్ అడిషనల్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు, వైస్ ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్‌రెడ్డి, డా.కె.కృష్ణమూర్తి, ప్రోగ్రాం ఇంచార్జీ డా.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా.లింగరాజు మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానాన్ని ప్రజలల్లోకి తీసుకుని వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నేటి నుంచి రెండు రోజులపాట పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య శిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు, వివిధ వనరుల నుంచి మందులు ఎలా తయారు చేస్తారనే విషయంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలతోపాటు, కళాశాలలోని హెచ్‌ఐవి పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరీక్షల గురించి వివరిస్తామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 4వేల మంది విద్యార్థులు ప్రదర్శనలు తిలకించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి బందులో భారీ బైక్ ర్యాలీ



బైకు ర్యాలీలో పాల్గొన్న శశిధర్‌రెడ్డి, దాము మహేందర్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన బందు కార్యక్రమం విజయవంతం అయ్యిందని చైతన్యపురి డివిజన్ కాంటెస్టెంట్ కార్పొరేటర్ కె.శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చైతన్యపురి కొత్తపేటలో నిర్వహించిన బిసి బంద్‌లో భాగంగా నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ అమలు కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. అన్ని పార్టీలు అన్ని కుల సంఘాలు పెద్ద ఎత్తున బందులో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడు దాము మహేందర్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి నీలం వెంకటేష్, గడ్డిఅన్నారం కాంగ్రెస్ నాయకుడు బి.వేణుయాదవ్, నాయకులు, కార్యకర్తలు,బిసి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరిలో భారీ ర్యాలీ



**నేరెడ్ మెట్, అక్టోబర్ 18,ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బీసీ బంద్ విజయవంతమైంది. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా నేరేడ్మెట్ చౌరస్తా నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు భారీ ర్యాలీకి నేతృత్వం వహించారు. ర్యాలీలో మహిళలు, యువత, ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ “బీసీలకు న్యాయం జరగాలంటే 42 రిజర్వేషన్లు అమలు చేయాలి. బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో ఆమోదిస్తేనే సమన్యాయం జరుగుతుంది. బీసీ హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుంది” అని స్పష్టం చేశారు. బంద్‌ను శాంతియుతంగా నిర్వహించామని, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఈ బంద్ బీసీ హక్కుల ఉద్యమానికి ప్రజల విశేష మద్దతు లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, జీ.కే. హనుమంతు రావు, కరంచంద్, తోట నరేందర్ రెడ్డి, చిన్న యాదవ్, శివ గౌడ్, సుమన్ గౌడ్, మోసిన్, శరణ గిరి, శోభ, కమల, మంజుల యాదవ్, ఇక ఇతర పార్టీల నుంచి ఒగ్గు చంద్రశేఖర్ (టీడీపీ), నవీన్ గౌడ్ (కాంగ్రెస్), హరి (సీపీఐఎం), యాదగిరి గౌడ్, మురళి, దశరథ్ కూడా మద్దతు తెలిపారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి : శ్రీనివాస్



ముసారాంబాగ్ లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు కిషన్ సింగ్, మహమ్మద్ షకీల్ నాయకులు మహేష్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 18, ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం నిర్వహించిన బీసీ బంద్ కు మద్దతుగా చెకోలెకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్ చౌరస్తా, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బిల్లును పాస్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ బంద్ కు మద్దతుగా స్వచ్ఛందంగా అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించడం జరిగిందని, వారందరికీ తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదారం కృష్ణ, దుగ్గు జగదీష్, కిషన్ సింగ్, మహమ్మద్ షకీల్,నాయకులు లింగాల శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి, మహేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



**వనస్థలిపురం, అక్టోబర్ 18,ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన శ్రీ లక్ష్మీదేవి పూజల్లో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి, ఎస్ ఏ ఓ రమణారెడ్డి, డి ఈ (టెక్నికల్) రాజారాం రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ భగవాన్ సింగ్, శేఖర్ రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కే శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, పర్సనల్ ఆఫీసర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు మంచి వక్తలు కావాలి



వక్తృత్వ పోటీల విజేతలకు షీల్డ్‌లు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసిన నారాయణ జిఎం, ఎజిఎంలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో ప్రతిభా పాటవాలను చాటాలని నారాయణ పాఠశాలల జిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబులు సూచించారు. మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో వనస్థలిపురం జోన్ నారాయణ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారు పోటీల్లో విజేతలపై వారికి షీల్డ్‌లు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు వాక్చాతుర్యం ఉండాలి మంచి విషయాలపై ప్రసంగాల ద్వారా ప్రతిభను చాటాలని సూచించారు. వక్తృత్వ పోటీల ద్వారా విద్యార్థుల్లో భయం తొలగి ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని వారు వెల్లడించారు. నారాయణ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులను మంచి వక్తలుగా తీర్చిదిద్దడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ ప్రిన్సిపాల్ బాబ్జి, టెన్త్ ఇంఛార్జి ముతాజ్, హైస్కూల్ ఆర్అండ్‌డి శివరంజని, ఈ-ఛాంప్స్ ఆర్అండ్‌డి మహేశ్వరి, ఈ-కిడ్స్ ఆర్అండ్‌డి మీన, సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్రంలో చిత్రం శ్రీనివాస్ గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పూజకు హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పథకం పత్రాలను అందజేస్తున్న ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు, బాలాపూర్ 15వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బాల్‌నింగని జంగయ్య